క్లుప్తంగా

18న జాతీయస్థాయి కబడ్డీ పోటీలు

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గ దేవస్థానంలో ఈ నెల 18వ తేదీన జాతీయ స్థాయి పురుషుల కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ గుర్రాల చెన్నారెడ్డి తెలిపారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా దాతల సహకారంతో నిర్వహిస్తున్న పోటీలను ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. పోటీలలో గెలుపొందిన విజేత జట్లకు తొలి ఆరు స్థానాలకు గాను వరుసగా రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల చొప్పున నగదు బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు రూ.500లు ప్రవేశ రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 81427 47710, 93460 94529 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

దీన్ దయాల్ ఆశయ సాధనకు కృషి చేద్దాం

కోడుమూరు రూరల్: మానవతావాది, బీజేపీ వ్యవస్థాపకులు పండిట్ దీన్ దయాల్ ఆశయాల సాధనకు కార్యకర్తలంతా కృషి చేయాలని ఆ పార్టీ కోడుమూరు నియోజకవర్గ కన్వీనర్ మీసాల ప్రేమ్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక బీజేపీ కార్యాలయంలో పండిత్ దీన్ దయాల్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజా ప్రయోజనాలకై ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతానికి తన వంతుగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో స్థానిక బీజేపీ నేతలు సురేంద్ర, శ్రీరాములు, కృష్ణ, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

కళకళలాడుతున్న వరిపైర్లు



సి.బెళగల్‌లో సాగు చేసిన వరి పంట

సి.బెళగల్: మండల కేంద్రమైన సి.బెళగల్ చెరువు నీటి కింద సాగుచేసిన వరి పైర్లు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. గ్రామ శివారులోని 115 ఎకరాలలో రైతులు ఏటా వరి సాగు చేస్తారు. గ్రామ ప్రవేశ దారిలో పచ్చదనంతో కనువిందు చేసున్నాయి. గత ప్రభుత్వంలో సరిగా వర్షాలు కురువకపోవడంతో చెరువులో నీరులేక కళాహీనంగా మారి, వరిమడులు బీడుగా కనిపించేవి. అయితే ఇప్పుడు సమృద్ధిగా వర్షాలు కురవటంతో పాటు, నియోజకవర్గ, స్థానిక నాయకుల సహకారంతో చెరువుకు వర్షపునీటికి తోడుగా పుల్లకుర్తి ఎత్తిపోతల పథకం నీటిని ఎక్కువ స్థాయిలో మళ్లించటంతో జలకళను సంతరించుకుంది. దీంతో చెరువు కింద పొలాలు పచ్చదనం సొంతం చేసుకున్నాయి.

రాష్ట్ర పోటీల్లో కర్నూలుకు బంగారు పతకాలు

కర్నూలు (టౌన్): విజయవాడలోని ఈడుపుగల్లు పట్టణంలోని స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన స్విమ్మింగ్ పోటీల్లో కర్నూలు స్విమ్మర్లు బంగారు పతకాలు సాధించారు. నగరంలోని మాంటిస్సోరి పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న దేవ శృతిసాయి అండర్-17 విభాగంలో 200 మీటర్ల బ్రెస్ట్‌స్ట్రోక్, 800 మీటర్ల ఫ్రీస్టైయిల్ పోటీల్లో బంగారు పతకాలు గెలుపొందింది. అలాగే ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న సామియా టాంజీన్ అండర్-17 విభాగంలో 200 మీటర్ల బట్టర్ ఫ్లై పోటీల్లో బంగారు పతకం సాధించింది. ఇరువురు స్విమ్మర్లు పతకాలు తెచ్చుకోవడంపై స్పోర్ట్స్ అథారిటీ చీఫ్ కోచ్, స్విమ్మింగ్ కోచ్ నటరాజరావు హర్షం వ్యక్తం చేశారు.

పోక్సో కేసు నమోదు

కర్నూలు సిటీ: కర్నూల్ నగరంలోని సున్నముగేరికి చెందిన షేక్ మోషిన్ అనే వ్యక్తిపై వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో పోపోక్సో చట్టం కింద కేసు నమోదు అయ్యింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. షేక్ మోషిన్ ఇంటికి ఎదురుగా ఉన్న ఇంట్లోని మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ విషయం సదరు మహిళ తన అత్త దృష్టికి తీసుకుపోవడంతో షేక్ మోషిన్‌ను నిలదీశారు. దీంతో వారి మధ్య వాగ్వాదం పెరిగిపోయింది. మోషిన్ ఇంట్లోని మహిళలు వారిపై దాడి చేశారు. బాధిత మహిళల కేకలు విని స్థానికులు కొందరు అక్కడికి వచ్చే సరికి షేక్ మోషిన్‌తో అతని కుటుంబ సభ్యులు పరారయ్యారు. ఈ ఘటనపై బాధిత మహిళా ఫిర్యాదు చేయడంతో మోషిన్ పై పోక్సో కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సారా, మట్కా చీటీలు స్వాధీనం

నగరంలోని జమ్మి చెట్టుకి సమీపంలో ఇద్దరు వ్యక్తులు సారాయి విక్రయిస్తుండగా వన్ టౌన్ పోలీసులు దాడి చేసి వారి నుంచి పది సారా బాటిళ్లు, మట్కా చీటీలు స్వాధీనం చేసుకున్నారు. చిత్తారి వీధి చెందిన సయ్యద్ హబీబుల్లా, నాగప్ప వీధికి చెందిన శ్రీ బాలస్వామిలపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు

బ్రహ్మోత్సవాలకు వేళాయె

- ఈ నెల 17 నుంచి బుగ్గరామేశ్వరుడి శివరాత్రి బ్రహ్మోత్సవాలు
- 20న రథోత్సవం
- అన్ని ఏర్పాట్లు చేస్తున్న ఆలయ అధికారులు



స్వాముల వారి ప్రధాన గర్భగుడి,(ఇన్‌సెట్)ఆలయంలో వెలసిన స్వామి, అమ్మవారు

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గ గ్రామంలో వెలసిన బుగ్గరామేశ్వరస్వామి మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు ఈ నెల 17 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ ఏడాది వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు, పాలక మండలి సభ్యులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. వారం రోజుల పాటు జరిగే ఉత్సవాలలో భాగంగా 17న స్వాముల వారు కాల్వ గ్రామం నుంచి వర ప్రయాణం చేస్తారని ఆలయ ఈఓ డీఆర్‌కేవీ ప్రసాద్ తెలిపారు.

18న శివరాత్రి వేడుకలకు అంకురార్పణ :

కాల్వబుగ్గ దేవస్థానంలో ఈ నెల 18వ తేదీన ధ్వజారోహణముతో మహాశివరాత్రి వేడుకలకు అంకురార్పణ గావిస్తారు. ఉదయం భ్రమరాంబదేవి, బుగ్గరామేశ్వర స్వాముల వారికి పంచామృతాభిషేకం, రాత్రి స్వాముల వారికి యమాభిషేకంతో జాగారణ నిర్వహిస్తారు. 19వ తేదీ తెల్లవారు జామున స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవం, అదే రోజు ఉదయం సింహవాహన సేవ, సాయంత్రం నంది వాహన సేవ, ప్రభోత్సవం చేపట్టనున్నారు. 20వ తేదీ సాయంత్రం ఆదిదంపతుల రథోత్సవం కనుల పండువగా నిర్వహించనున్నారు. 21వ తేదీ వసంతోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. 22వ తేదీన స్వాముల వారు కాల్వ గ్రామానికి తిరుగు ప్రయాణమవుతారని ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ గుర్రాల చెన్నారెడ్డి వెల్లడించారు.

ఆలయ చరిత్ర :

కర్నూలు నుంచి నంద్యాలకు వెళ్లే మార్గంలో జాతీయ రహదారి ప్రక్కన పురాతన బుగ్గరామేశ్వర స్వామి ఆలయం వెలిసింది. పూర్వం పరుశురాముడు తన తండ్రి జమదగ్నిని సంహరించిన క్షత్రియ రాజులను దేశ నలుమూలల శోధించి నిర్మూలనం గావించారు. ఈ క్రమంలో తన దోషనివృత్తి భాగంగా కాల్వబుగ్గను సందర్శించారు. ఆ సమయంలో పరశురాముడు స్వహస్తాలతో శివలింగాన్ని ప్రతిష్ఠి పుణక్షేత్రంను నిర్మించినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. ఆలయ గర్భగుడి ఎదురుగా నిలిచిన జంట నందులు, క్షేత్ర సమీపంలో గల కొండలో దర్శనమిస్తున్న బసవన్నపాదాలు, దూరుడు గుండు, తూర్పుదిశలో వెలసిన చిన్న బుగ్గ ప్రాంతం క్షేత్ర విశేషములుగా భక్తులు భావిస్తారు.



ఆలయ ప్రాంగణంలోని పెద్ద పుష్కరిణి

భక్తులకు ఏర్పాట్లు:

బ్రహ్మోత్సవాల సందర్భంగా క్షేత్రానికి వచ్చే భక్తులు, సందర్శకుల కోసం ఆలయ అధికారులు అన్ని సౌకర్యాలు కల్పించనున్నారు. ఇందులో ప్రధానంగా స్థానిక పుష్కరిణీలను శుభ్రం చేసి, విద్యుత్ మోటర్ల ద్వారా నీటిని నింపుతున్నారు. స్త్రీ పురుషులకు ప్రత్యేక స్నానపు ఘట్టాల ఏర్పాటు, వాహనాల పార్కింగ్, వ్యాపార దుకాణాల కోసం వేర్వేరుగా స్థలాలను కేటాయించారు. క్యూలైన్లు, చలువ పందిళ్లు, ఉచిత వైద్యం శిబిరం ఏర్పాటు చేయనున్నారు. మహాశివ రాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రజల కాలక్షేప నిమిత్తం పలు రకాల వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా 18న ఉదయం చెక్కభజన, కోలాట సాంస్కృతిక ప్రదర్శనలు, జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు, రాత్రి సినీ సంగీత విభావరి ఏర్పాటు చేశారు. 19వ తేదీ రాత్రి భజన పోటీలు, 20వ తేదీ రాత్రి పంచమాంకములు నాటక ప్రదర్శన, మూడురోజుల పాటు భక్తులకు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ఆర్థిక సాయం అందజేత



మృతుడి భార్య కృష్ణవేణికి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

పాణ్యం: పాణ్యం మండల 108 వాహన డ్రైవర్‌గా విధులు నిర్వహించే దాది శ్రీకాంత్ ప్రమాదవశాత్తు ఇటీవల మరణించాడు. అయితే మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రభుత్వం నుంచి రూ.3 లక్షలు ఆర్థియ సాయం మంజూరు చేయించి అండగా నిలిచారు. ఈ మేరకు శనివారం చెక్కును మృతుడి భార్య కృష్ణవేణికి ఎమ్మెల్యే అందించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కొల్పోయిన 108 వాహన డ్రైవర్ దాది శ్రీకాంత్ సేవలు మరువలేనివని కొనియాడారు. మృతుడి భార్య సీఎంకు, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

సుంకేసులలో 1,450 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌కు శనివారం 1,450 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు డ్యామ్ అధికారులు తెలిపారు. డ్యామ్‌లో 0.881 టీఎంసీల నీరు నిల్వ ఉందని, కేసీ కాల్వకు 817 క్యూసెక్కుల నీటి విడుదల చేసినట్లు వారు పేర్కొన్నారు.

శివస్వాములకు అన్నదానం

గూడూరు రూరల్: కె.నాగలాపురంలోని గ్రామ దేవత సుంకులాపరమేశ్వరీదేవి దేవాలయం ఆధ్వర్యంలో శనివారం శివస్వాములు, పాదయాత్రికులకు రెండో రోజు అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ కార్యనిర్వాహణ అధికారి దినేష్ కొనసాగించారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని వారం రోజుల పాటు దేవాలయం ఆధ్వర్యంలో శ్రీశైలానికి వెళ్తున్న భక్తులకు స్థానిక శివాలయంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

శ్రీశైలంలో అన్నదానం

గూడూరు: శివరాత్రి పర్వదినం సందర్భంగా శ్రీశైలంలో అన్నదానం నిర్వహించడానికి గూడూరు వాసులు శనివారం వాహనంలో తరలివెళ్లారు.



కె.నాగలాపురంలో శివస్వాములకు భోజనం అందిస్తున్న దృశ్యం

శ్రీశైలం పుణ్యక్షేత్రంలో భక్తులకు అన్నదానం ప్రతి ఏటా వారం రోజుల పాటు నిర్వహిస్తామని మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఎల్.వెంకటేశ్వర్లు తెలిపారు. దాతల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

58,099.48 ఎకరాల్లో భూముల రీసర్వే పూర్తి

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలంలోని గ్రామాల్లో శనివారం నాటికి 58,099.48 ఎకరాల్లో భూముల రీ సర్వే పూర్తయిందని కర్నూలు రూరల్ ఇన్‌చార్జ్ తహసీల్దార్ శివరాముడు అన్నారు. మండల పరిధిలోని 21 రెవెన్యూ గ్రామాల్లో భూముల రీ సర్వే పకడ్బందీగా కొనసాగుతోందన్నారు. గ్రామాల్లో చేపడుతున్న రీ సర్వేపై ఎప్పటికప్పుడు వీఆర్‌ఓలు, గ్రామ సర్వే సహాయకులతో సమీక్షిస్తున్నామన్నారు. రైతులకు ముందస్తుగా గ్రామాల్లో దండోరా వేయించి సమాచారం అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు తమ పొలాల వద్ద ఉండి వివరాలను సర్వే బృందాలకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలి



ఎస్‌ఐ పీరయ్యతో మాట్లాడుతున్న సీఐ శ్రీధర్

సి.బెళగల్: గ్రామాలలోని ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై పోలీసులు సత్వరమే స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోడుమూరు సీఐ శ్రీధర్ సూచించారు. శనివారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు, కేసులు వివరాలను ఎస్‌ఐ పీరయ్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందితో ఈ మధ్యకాలంలో నమోదైన కేసులు, ప్రజల ఫిర్యాదులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉండి ఆపదలో ఉన్నవారికి సహాయపడాలన్నారు. విధుల నిర్వహణలో జాగ్రత్తలను వహించాలని, భూ తగాదాలను సివిల్ కోర్టులు, రెవెన్యూ పరిధిలో పరిష్కరించుకునేలా ప్రజలకు సూచించాలన్నారు. అదేవిధంగా పెట్టి కేసులను లోక్ అదాలత్‌లోకి వచ్చేలా ఫిర్యాదు దారులకు అవగాహన కల్పించాలన్నారు.

మిత్రుడి కుటుంబానికి చేయూత



ఈశ్వరయ్య కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న స్నేహితులు

కల్లూరు: మండల పరిధిలోని ఉలిందకొండ గ్రామానికి చెందిన ఈశ్వరయ్య ఈనెల 5వ తేదీన మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఉలిందకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1983 పదో తరగతి బ్యాచ్ స్నేహితులు ఈశ్వరయ్య కుంటుబానికి ఆర్థికంగా చేయూతనందించారు. శనివారం గ్రామానికి చేరుకున్న చిన్ననాటి స్నేహితులైన దేవపూజ ధనుంజయ్య ఆచారి, చిన్న నారాయణ, తిమ్మప్ప, రామాంజనేయులు, నాగమద్దయ్య, ఖాదర్ బాష, లాల్ అందరూ కలసి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం ఈశ్వరయ్య భార్య జయమ్మ, కుమార్తె శివరాణిలకు రూ.26,016 ఆర్థిక సాయం అందజేశారు.

కేసు నమోదు

పాణ్యం: మండల పరిధిలోని ఆలమూరు గ్రామంలో జరిగిన దొంగతనంపై గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి శనివారం తెలిపారు. వివరాలు..రెండు రోజుల క్రితం గ్రామంలో ముగ్గురు దొంగలు ట్రాక్టర్లకు ఉన్న బ్యాటరీలు తొలగించి ఆటోలో ఎత్తుకెళ్తున్నారు. ఈ క్రమంలో గమనించిన గ్రామస్తులు కేకలు వేయడంతో దొంగలు బ్యాటరీలను అక్కడే పడేసి వెళ్లారు. గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దొంగతనానికి పాల్పడిన వారు నంద్యాలకు చెందిన వారుగా గుర్తిస్తున్నట్లు చెప్పారు.

మతిస్థిమితంలేని మహిళ మూత్రాశయంలో పెన్సిల్

- ఇన్‌ఫెక్షన్ కావడంతో పనిచేయని కిడ్నీలు
- చాకచక్యంగా తొలగించిన వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): మతిస్థిమితం లేని మహిళ మూత్రాశయంలో ఇరుక్కున్న పెన్సిల్‌ను కర్నూలులోని మెడికవర్ హాస్పిటల్ వైద్యులు చాకచక్యంగా తొలగించారు. వివరాలను శనివారం యురాలజిస్టు డాక్టర్ అబ్దుల్ సమద్ వివరించారు. 32 సంవత్సరాల మతిస్థిమితం లేని మహిళ ఇటీవల తీవ్రమైన కడుపునొప్పితో ఆసుపత్రికి వచ్చిందని, ఆమెకు పరీక్షలు నిర్వహించగా రెండు కిడ్నీలు పనిచేయని స్థితిలో ఉండి, కడుపులో చీము పేరుకుపోయిందన్నారు. సిటిస్కాన్ చేసిన తర్వాత ఆమె మూత్రాశయంలో పదునైన పెన్సిల్ చేరి మూత్రాశయానికి రంధ్రాలు పడి కడుపులో మూత్రం లీక్ అవుతున్నట్లు నిర్ధారించామన్నారు. వెంటనే అత్యవసర శస్త్ర చికిత్స చేసి పెన్సిల్ తొలగించామని.. మూత్రాశయంలో రంధ్రాలను సవరించి ప్రాణాలను కాపాడామన్నారు. శస్త్రచికిత్సలో తనతో పాటు అనెస్తెటిస్ట్ డాక్టర్ బాలప్రవీణ్, డాక్టర్ రేష్మ పాల్గొన్నట్లు తెలిపారు.

వాల్మీకులకు ఎస్‌టీ రిజర్వేషన్ సాధనే ధ్యేయం

కర్నూలు(అర్బన్): వాల్మీకుల ఎస్‌టీ రిజర్వేషన్ సాధనే ధ్యేయంగా వీఆర్‌పీఎస్ ఉద్యమాలను చేస్తూనే ఉంటుందని వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకులు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.సుభాష్ చంద్రబోస్ అన్నారు. శనివారం తన కార్యాలయంలో జరిగిన ముఖ్య నేతల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ... వాల్మీకులను ఎస్‌టీ జాబితాలో చేర్చాలని 2007 నుంచి వీఆర్‌పీఎస్ ప్రజాస్వామ్య పద్ధతిలో అనేక రూపాల్లో ఉద్యమాలు కొనసాగించిందన్నారు. 2015లో కుప్పం నుంచి హైదరాబాద్ వరకు పాదయాత్ర నిర్వహించడం జరిగిందన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా చేపట్టిన అనేక ఉద్యమాల ఫలితంగా టీడీపీ ప్రభుత్వం అప్పట్లో అసెంబ్లీ తీర్మాణం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపిందన్నారు. అయితే తీర్మాణంలో చోటు చేసుకున్న తప్పులను సరిచేసి తిరిగి పంపాలని కేంద్రం కోరినా, అప్పటి టీడీపీ ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోలేదన్నారు. ప్రస్తుత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాతవాటిని తిరగదోడకుండా తాజాగా వాల్మీకుల స్థితిగతులపై నివేదికలు రూపొందించేందుకు రిటైర్డు ఐఏఎస్ అధికారి శామ్యూల్ ఆనంద్‌కుమార్ నేతృత్వంలో ఏక సభ్య కమిషన్ ఏర్పాటు చేశారన్నారు. ఈ కమిషన్ రెండు, మూడు నెలలు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి వాల్మీకుల స్థితిగతులపై నివేదికలు రూపొందించి ప్రభుత్వానికి అందజేయనుందన్నారు. ఈ నివేదికల ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం రానున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో వాల్మీకులను ఎస్‌టీ జాబితాలో చేర్చే అంశంపై తీర్మాణం చేసి కేంద్రానికి పంపుతుందనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

కేంద్రంతో అమీతుమీ ...

రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మాణం చేసి కేంద్రానికి పంపిన వెంటనే వీఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఉద్యమాలను చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలోనే కర్నూలు నుంచి పార్లమెంట్ వరకు పాదయాత్ర నిర్వహిస్తామన్నారు. ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఢిల్లీలోనే ఆమరణ నిరాహార దీక్ష చేసేందుకు కూడా వెనుకాడబోమన్నారు. ఎస్‌టీ రిజర్వేషన్ సాధనే ధ్యేయంగా సాగుతున్న ఈ ఉద్యమాల్లో రాజకీయాలకు అతీతంగా వాల్మీకులందరు కలిసి రావాలన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కప్పట్రాళ్ల మల్లికార్జున, జిల్లా అధ్యక్షులు మొలగవెల్లి రామాంజనేయులు, ఉపాధ్యక్షులు గోవిందప్ప, మాజీ జెడ్పీటీసీ మాలపల్లి లక్ష్మయ్య, ఆలూరు సీనియర్ నాయకులు ఆంజనేయులు, శివ, అంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైళ్లపై రాళ్లు విసిరితే కఠిన చర్యలు



రైల్వే స్టేషన్‌లో అవగాహన కల్పిస్తున్న పోలీసు అధికారులు

కర్నూలు(రాజ్‌విహార్): రైళ్లపై రాళ్లు విసరడం, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆర్‌పీఎఫ్ కర్నూలు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వి.సత్యనారాయణ హెచ్చరించారు. త్వరలో కాచిగూడ-బెంగళూరు మధ్య వందే భారత్ రైలు నడపనున్న నేపథ్యంలో ఆర్‌పీఎఫ్ పోలీసులు శనివారం కర్నూలులోని కేసీ కెనాల్, కర్నూలు సిటీ స్టేషన్, కోట్ల హాల్ట్, దూపాడు రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో అనుమానితులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇటీవలి కాలంలో వందే భారత్ రైలుపై వివిధ ప్రాంతాల్లో రాళ్లు విసిరిన నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. వందే భారత్ రైలుకు ఏదైనా నష్టం కలిగిస్తే రైల్వే చట్టం ప్రకారం కఠిన కేసులు పెడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్లు అశోక్‌కుమార్, కల్పన, స్వామి, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

నేటి సమాచారం

విద్యావంతుల సదస్సు..బడ్జెట్ చర్చ

కర్నూలు(సెంట్రల్): బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం విద్యావంతుల సదస్సు..కేంద్ర బడ్జెట్‌పై చర్చ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాళింగి నరసింహవర్మ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు మౌర్య ఇన్ హోటల్‌లోని విభు ఫంక్షన్ హాలులో జరిగే ఈ సదస్సుకు కేంద్రమంత్రి దేవుసిన్హా చౌహాన్, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లు చెప్పారు.

ఘంటసాల జీవితంపై నాటక ప్రదర్శన

కర్నూలు(సెంట్రల్): శతాబ్ది గాయకుడు ఘంటసాల వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు టీజీవీ కళాక్షేత్రంలో ఆయన జీవిత ఇతివృత్తంపై రచించిన కథ ఆధారిత ప్రదర్శనను నిర్వహిస్తున్నట్లు టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, కన్వీనర్ చంద్రకంటిమద్దయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన సురభి నాట్య మండలి సభ్యులు సుమారు 40 మంది ఇందులో వివిధ పాత్రల్లో నటించనున్నట్లు చెప్పారు.

ఉచిత మెడికల్ క్యాంపు

కర్నూలు(సెంట్రల్): ఈ నెల 22వ తేదీన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని కిమ్స్ ఆసుపత్రి సౌజన్యంతో ఆదివారం ఉచిత మెడికల్‌క్యాంపును నిర్వహించనున్నట్లు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సేవా సమితి నాయకుడు సుబ్బారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏ క్యాంపులోని మాంటిస్సోరి పాఠశాలలో నిర్వహించే ఈ మెడికల్ క్యాంపును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న సర్పంచు గోవర్ధన్

ఓర్వకల్లు: మండలంలోని కేతవరం గ్రామంలో శనివారం సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. గ్రామ సర్పంచు గోవర్ధన్ భూమి పూజ నిర్వహించి, పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచు మాట్లాడుతూ గ్రామంలోని వైఎస్సార్ విగ్రహం నుంచి చిత్రాల గుహకు వెళ్లే రహదారిలో సుమారు 250 మీటర్ల దూరం వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.10 లక్షలు డీఎంఎఫ్ నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సహకారంతో సీసీ రోడ్డును నాణ్యతా ప్రమాణాలతో నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ ఎఫెక్ట్.. పన్ను చెల్లింపు షురూ!

- పన్ను చెల్లించిన బకాయిదారులు
- మొదటి రోజు రూ. 12.85 లక్షలు వసూలు



పన్నులు చెల్లించేందుకు వచ్చిన బకాయిదారులు

కర్నూలు (టౌన్): 2022-2023 ఆర్థిక సంవత్సరం మరో నెల రోజుల వ్యవధిలో ముగియనుంది. ఇప్పటికే మొండి బకాయిదారులకు ఎన్నిసార్లు రెడ్‌కార్నర్ నోటీసులు జారీ చేసిన స్పందించకపోవడంతో నగర పాలక రెవెన్యూ అధికారులు లోక్ అదాలత్ కోర్టును ఆశ్రయించారు. స్పందించిన కోర్టు మొండి బకాయిదారులందరికీ నోటీసులు జారీ చేసింది. పన్ను బకాయిలు చెల్లించాలని, లేకుంటే జప్తు వంటి చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. 3,157 మంది మొండి బకాయిదారులకు నోటీసులు రావడంతో మొదటి రోజు కొంత మంది స్పందించారు. వీరందరి కోసం శనివారం నగరపాలక కార్యాలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా శిబిరం ఏర్పాటు చేశారు. పేటలు, వార్డుల వారీగా పన్నులు చెల్లించే విధంగా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకున్నారు. అందులో భాగంగానే ఆస్తిపన్ను బకాయిలు రూ.10.80 లక్షలు, నీటి పన్ను బకాయిలు రూ.2.05 లక్షలు వసూలు అయినట్లు రెవెన్యూ అధికారులు జునీద్, మన్సూర్ వెల్లడించారు. నోటీసులు వచ్చిన వారందరు తప్పని సరిగా పన్ను బకాయిలు చెల్లించాలని లేకుంటే కోర్టు ఆదేశాలు అమలు అవుతాయని వెల్లడించారు.

యునాని వైద్యం ప్రతి ఒక్కరూ తీసుకోవచ్చు



మాట్లాడుతున్న జాయింట్ డైరెక్టర్ ఎం.సరస్వతి

కర్నూలు(హాస్పిటల్): యునాని వైద్యం కేవలం ఒక వర్గానికి చెందినదిగా చాలా మందిలో భావన ఉందని, ఇది ప్రతి ఒక్కరూ నిరభ్యంతరంగా తీసుకోవచ్చని కమిషనర్ ఆఫ్ ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ జాయింట్ డైరెక్టర్ ఎం.సరస్వతి చెప్పారు. జాతీయ యునాని దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏపీ యునాని వైద్యుల సంఘం ఆధ్వర్యంలో శనివారం కర్నూలు నగరంలో యునాని వైద్య అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేవీఆర్ ప్రభుత్వ మహిళా కళాశాల ఆవరణలో ఉచిత యునాని వైద్యశిబిరం నిర్వహించారు. కళాశాలలో విద్యార్థులకు పలు అంశాలపై సైంటిఫిక్ సెషన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.సరస్వతి హాజరై మాట్లాడారు. యునాని వైద్యం దీర్ఘకాలిక వ్యాధులకే గాకుండా దగ్గు, జలుబు, అన్ని రకాల రుగ్మతల నివారణకు ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ బి. రామగిడ్డయ్య, కేవీఆర్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిర శాంతి, ఏపీ యునాని వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ షాకిర్ అహ్మద్, జనరల్ సెక్రటరీ డాక్టర్ షఫ్రాజ్ నవాజ్, జాయింట్ సెక్రటరీలు డాక్టర్ శాంతిశిరిల్, డాక్టర్ నవీన్‌కుమార్, సభ్యులు డాక్టర్ కరీమున్నీసా, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఫయాజుద్దీన్ పాల్గొన్నారు.

రహదారి.. అందంగా మారి



అందంగా తయారైన కె.మార్కపురం రోడ్డు(నేడు)

కల్లూరు: ఏళ్ల తరబడి ప్రజలకు నరకం చూపించిన గ్రామీణ రహదారులు బాగుపడి అందంగా మారాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాడు-నేడు కార్యక్రమం కింద ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రుల తరహాలోనే రహదారులను అభివృద్ధి చేస్తోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రోడ్లను పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో రహదారులు అధ్వానంగా మారాయి. కె.మార్కపురం రోడ్డుపై ప్రయాణం చేయాలంటే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం డీఎంఎఫ్(మైనింగ్) నిధులు, బీటీ పాట్‌హోల్స్ కింద రూ.98 లక్షలు మంజూరు చేసింది. దీంతో కోడుమూరు రోడ్డు నుంచి వయా కె.మార్కపురం మీదుగా పెద్దకొటాల వరకు ఉన్న పంచాయతీ రాజ్ రోడ్డును అభివృద్ధి చేశారు. అధ్వానంగా ఉన్న రోడ్డు ప్రయాణానికి సౌకర్యవంతంగా మారడంతో కె.మార్కపురం, పెద్దకొట్టాల గ్రామస్తులతో పాటు ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



గుంతలమయమైన కె.మార్కపురం రోడ్డు(నాడు)

ప్రయాణ కష్టాలు తీరాయి



గతంలో రోడ్డు గుంతలమయంగా ఉండేది. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రత్యేకం చొరవ తీసుకుని రోడ్డును అభివృద్ధి చేశారు. దీంతో మార్కపురం ప్రజలతో పాటు ఇతర ప్రజల ప్రయాణ కష్టాలు తీరాయి. -మద్దిలేటి, కె.మార్కపురం సర్పంచ్